సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



ఘనంగా తిరుగువారం పండుగ
మేడారం, కన్నెపల్లి, పూనుగొండ్ల ఆలయాల్లో మేడారం తిరుగువారం పండుగను పూజారులు ఘనంగా నిర్వహించారు. - 8లో▸



ఆర్టీసీ ఉద్యోగులకు 'పవర్'
ఆర్టీసీ ఉద్యోగులను మానసికంగా, శారీరకంగా సన్నద్ధులను చేసేందుకు 'పవర్' పేరుతో శిక్షణ కార్యక్రమం చేపట్టింది. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0^0 / 21.0^0

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి అధికంగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.



ఇక్కడైతే సేఫ్..!
జిల్లాలో యథేచ్ఛగా గుట్కా దందా

- పక్క జిల్లాల్లో పోలీసుల తనిఖీలు, పట్టివేతలు
- భూపాలపల్లి బాటపట్టిన అక్రమ వ్యాపారులు
- ధరలు పెంచి మరీ విక్రయాలు

భూపాలపల్లి: గుట్కా దందాకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా సేఫ్ జోన్‌గా మారిందా.. అంటే ఔననే సమాధానమే వస్తుంది.. ఇతర జిల్లాల్లో పోలీసులు నిత్యం దాడులు చేస్తూ ప్రభుత్వం నిషేధించిన గుట్కా తదితర పొగాకు ఉత్పత్తులను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో అక్కడి వ్యాపారులంతా భూపాలపల్లి బాట పడుతున్నారు. ప్రతీరోజు సరుకుల మాటున వివిధ వాహనాల్లో గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులను రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇష్టమొచ్చిన ధరలు..!
పెద్దపల్లి జిల్లా మంథని, గోదావరిఖనికి చెందిన చెందిన ఇద్దరు వ్యాపారులు గుట్కా, పాన్ మసాలా, పొగాకు ప్యాకెట్లను తమ ఇష్టం వచ్చిన ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. వంద ప్యాకెట్లు (2,500 పౌచ్‌లు) ఉన్న ఒక పొగాకు బస్తాను రూ.25 వేలకు విక్రయిస్తున్నారు. అయితే ఒక పౌచ్‌పై ఎమ్మార్పీ ధర రూ.10 ఉండగా, ఆ ఇద్దరు వ్యాపారులు అదే ధరకు ఇక్కడి హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఫలితంగా వారికి రోజుకు రూ.లక్షల్లో లాభం చేకూరుతుంది.

ఈ నెల 7వ తేదీన టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులు



ఆ ఇద్దరిదే హవా..
రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలాలను భూపాలపల్లికి రవాణా చేయడంలో ప్రస్తుతం ఇద్దరు వ్యాపారుల హవా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందిన ఓ వ్యాపారి, గోదావరిఖనికి చెందిన మరో వ్యాపారి భూపాలపల్లి జిల్లా కేంద్రంతోపాటు కాటారం డివిజన్‌ను గుత్తా పట్టినట్లుగా తమ దందాను కొనసాగిస్తోండడం గమనార్హం. తమ సొంత వాహనాల్లో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో రూ.15 లక్షలకు పైగా విలువైన సరుకును జిల్లాలోని హోల్‌సేల్, కిరాణా షాపులు, మధ్య దళారులకు దిగుమతి చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు వ్యాపారులు కొయ్యూరు మీదుగానే రవాణా చేస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరినీ కట్టడి చేస్తే జిల్లాలో నూటికి 90 శాతానికి పైగా నిషేధిత పొగాకు ఉత్పత్తుల దందా ఆగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే హనుమకొండకు చెందిన ఓ వ్యాపారి ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్‌ల ద్వారా గుట్కాలను భూపాలపల్లి జిల్లాకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ జిల్లాలోనే ఎందుకిలా..?
జిల్లా సరిహద్దులోని వరంగల్, హనుమకొండ, పెద్దపల్లి జిల్లాల్లో ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ప్రతీరోజు దాడులు నిర్వహిస్తూ నిషేధిత గుట్కా, పాన్‌మసాలా తదితర పొగాకు ఉత్పత్తులను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో అక్కడి వ్యాపారులు వాటిని అమ్మేందుకు జంకుతున్నారు. అయితే భూపాలపల్లి జిల్లాలో మాత్రం పోలీసులు పెద్దగా దృష్టి సారించకపోవడంతో ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారుల దందా మూడు పూవులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతుంది. ఇప్పటికైనా జిల్లా పోలీసు అధికారులు స్పందించి క్యాన్సర్‌కు కారకమవుతున్న నిషేధిత గుట్కా, పాన్ మసాలాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

ఎస్టీ హాస్టల్ తనిఖీ



మల్హర్: మండల కేంద్రం తాడిచర్లలోని ఎస్టీ హాస్టల్‌ను బుధవారం సంక్షేమ శాఖ అకాడవిక్ మానిటరింగ్ అధికారి(ఏసీఎంఓ) రాజారత్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లోని సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని విద్యార్థులకు సూచించారు. టెన్త్‌లో ప్రతి విద్యార్థి 10 జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు సబ్బులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ కిరణ్, తదితరులు ఉన్నారు.

నేడు ఇసుక రీచ్‌ల పరిశీలన
కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని పలు ఇసుక క్వారీలను రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ గురువారం పరిశీలించనున్నట్లు తెలిసింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పలు క్వారీల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని, అధికారులు తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి అధికారులు క్వారీలను పరిశీలిస్తూ తనిఖీలు చేపడుతున్నారు. అయితే.. ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన వివరాలు అధికారులు గోప్యంగా ఉంచారు.

పన్నుల వసూళ్లలో అలసత్వం వహించొద్దు



భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్లలో సిబ్బంది అలసత్యం వహించొద్దని మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వార్డు అధికారులు, బిల్ కలెక్టర్ల సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఇప్పటి వరకు 45శాతం మాత్రమే పన్నులు వసూళ్లు చేయడం జరిగిందని, మార్చి 31వ తేదీ లోపు వంద శాతం వసూలు చేయాలని తెలిపారు. పట్టణంలో పేరుకుపోయిన ఇంటి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూలు విషయంలో అలసత్వం వహిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలు ఇంటి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు బకాయి లేకుండా చెల్లించాలని కోరారు.

ఆర్థిక ఒడిదుడుకులు

జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ)లో ఉమ్మడి జిల్లా వెనుకబాటు
- రూ.7,583 కోట్లతో ఆఖరున ములుగు
- జేఎస్ భూపాలపల్లిలో తగ్గి... ఐదు జిల్లాల్లో పెరిగిన 'తలసరి'
- తలసరి ఆదాయంలో 15వ స్థానంలో జేఎస్ భూపాలపల్లి
- హనుమకొండ జిల్లాలో అర్బన్ జనాభా.. మిగతా ఐదు జిల్లాల్లో పల్లెవాసమే
- 'రాష్ట్ర గణాంకాల నివేదిక- అట్లాస్-2024'లో వెల్లడి



సాక్షి ప్రతినిధి, వరంగల్:

జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ)లో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో వెనుకబాటు కనిపిస్తోంది. జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల అభివృద్ధి వృద్ధిరేటు రాష్ట్రంలోనే వెనుకబడి ఉంది. వరంగల్ అర్బన్ (హనుమకొండ) 14వ స్థానంలో ఉండగా.. వరంగల్ రూరల్ 22, (వరంగల్), మహబూబాబాద్ 23 స్థానాల్లో నిలిచాయి. 2021–22సంవత్సరానికి ప్రస్తుత ధరల్లో జీడీడీపీ విలువ పెరుగుదల కనిపించినప్పటికీ రాష్ట్రస్థాయిలో మిగతా జిల్లాలతో పోలిస్తే ఆశించిన స్థాయిలో వృద్ధి సాధించలేదు. తలసరి ఆదాయం విషయానికి వస్తే జయశంకర్ భూపాలపల్లి 15వ స్థానంలో నిలిచింది. జాతీయ ధరల సూచీ ప్రకారం దీనిని గణిస్తారు. ఇదే సమయంలో మిగతా ఐదు జిల్లాలు తలసరి ఆదాయంలో తెలంగాణలోని మిగతా జిల్లాలతో వెనకబడి ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక, గణాంకశాఖ ఇటీవల విడుదల చేసిన 'తెలంగాణ రాష్ట్ర గణాంకాల నివేదిక- అట్లాస్–2024'లో ఈ వివరాలు వెల్లడించారు.

పడుతూ లేస్తూ 14, 15 స్థానాల్లోనే..

ఉమ్మడి వరంగల్‌లో ఆరు జిల్లాలు ఉండగా.. 2022–23 సంవత్సరానికి ఆర్థిక వృద్ధిలో రాష్ట్రంలోని 33 జిల్లాలతో పోటీ పడలేకపోయాయి. జిల్లా స్థూల దేశీయోత్పత్తిలో 14వ స్థానంలో హనుమకొండ, తలసరి ఆదాయంలో 15వ స్థానంలో జేఎస్ భూపాలపల్లి జిల్లాలు నిలిచాయి. మిగతా నాలుగు జిల్లాలు ఆ తర్వాతి స్థానాలకే పరిమితమయ్యాయి. జీడీడీపీలో వరంగల్ 22, మహబూబాబాద్ 23, జనగామ 29, జేఎస్ భూపాలపల్లి 31 స్థానాల్లో నిలవగా.. రూ.7,583 కోట్లతో ములుగు జిల్లా అన్నింటికన్న చివరన నిలిచింది. జిల్లాల ఆర్థికాభివృద్ధికి సూచికగా జీడీడీపీని పరిగణించగా అభివృద్ధి అంతా రంగారెడ్డి, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కేంద్రీకృతం కాగా, నగరాలు, పట్టణ ప్రాంతాల్లో కొద్దిగా మెరుగ్గా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. గ్రేటర్ వరంగల్ చుట్టూ జరుగుతున్న అభివృద్ధి కారణంగా ఆర్థికవృద్ధిలో టాప్–2లో నిలిచినట్లు చెబుతున్నారు.

పట్నవాసం వద్దు, పల్లె నివాసమే బెస్ట్....

ఉమ్మడి వరంగల్‌లో 38,20,369 మంది జనాభా ఉంది. ఇందులో 28,28,036 మంది పల్లెల్లో, 9,92,333 మంది పట్టణాల్లో జీవనం గడుపుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ప్రజలు నివాసం పట్టణం/నగరాలైన హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డిల తర్వాత స్థానంలో హనుమకొండ నిలిచింది. ఉమ్మడి వరంగల్‌లో హనుమకొండ మినహా ఐదు జిల్లాల్లో జనం ఊళ్లల్లోనే ఉంటున్నారు. హనుమకొండ జిల్లాలో మాత్రమే 10,62,247 మంది జనాభాలో 5,63,629 (53.1 శాతం) మంది పట్నంలో ఉంటుండగా, 4,98,618 (46.9 శాతం) మంది గ్రామాల్లో ఉంటున్నారు. వరంగల్ జిల్లాలో 7,37,148లకు 69.2 శాతం మంది పల్లెటూళ్లలో, 30.8 శాతం మంది పట్టణ వాసం చేస్తున్నారు. జనగామలో 5,34,991 జనాభాకు 4,63,634 (86.7 శాతం) మంది గ్రామాల్లో, 71,357 (13.3శాతం) పట్టణాల్లో, జేఎస్ భూపాలపల్లిలో 4,16,763లకు 3,74,376 (89.8 శాతం) గ్రామాల్లో, 42,387 (10.2 శాతం) పట్టణాల్లో ఉంటున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. అదే విధంగా మహబూబాబాద్ జిల్లాలో 7,74,549 మందికి 6,98,173 (90.1 శాతం), పల్లెలు, తండాల్లో, 76,376 (9.9 శాతం) మందే పట్టణాల్లో ఉంటుండగా.. ములుగు జిల్లాలో 2,94,671లకు 96.1 శాతం మంది పల్లెటూళ్లలో ఉంటుండగా.. కేవలం 11,493 (3.9 శాతం)మంది పట్నవాసం చేస్తున్నారు.

తలసరి ఆదాయంలో భూపాలపల్లే బెటర్..
2022–23లో రంగారెడ్డి జిల్లా రూ.9,54,949 తలసరి ఆదాయంతో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవగా.. రూ.2,28,655తో జయశంకర్ భూపాలపల్లి జిల్లా 15వ స్థానంలో నిలిచింది. అయితే 2021–22 ఇది రూ.2,34,132లు కాగా ఈసారి రూ.5,477 తగ్గినా.. మిగతా జిల్లాలతో పోలిస్తే ఎక్కువై 15వ స్థానంలో ఉంది. వరంగల్ రూరల్ (వరంగల్) గతంలో రూ.1,94,317తో 16వ స్థానంలో ఉండగా.. ఈసారి రూ.2,20,174లకు పెరిగినా 18వ స్థానంలో నిలిచింది. అలాగే రూ.1,86,278లున్న జనగామ ఈసారి రూ.2,21,424లతో 16, రూ.1,79,222లతో 20వ స్థానంలో ఉన్న మహబూబాబాద్ రూ.2,00,309లతో 25, రూ.1,77,316లతో 21లో ఉన్న ములుగు రూ.2,15,772లతో 19 స్థానాల్లో నిలవగా, రూ.1,56,086లతో చివరి స్థానంలో నిలిచిన వరంగల్ అర్బన్ (హనుమకొండ) ఈసారి రూ.1,86,618లతో 31వ స్థానంలో ఉంది.

జిల్లాల వారీగా మొత్తం జనాభా, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇలా..

జిల్లా	మొత్తం జనాభా	గ్రామీణం జనాభా	పట్టణ/నగరం జనాభా
హనుమకొండ	10,62,247	4,98,618	5,63,629
వరంగల్	7,37,148	5,10,057	2,27,091
జనగామ	5,34,991	4,63,634	71,357
జేఎస్.భూపాలపల్లి	4,16,763	3,74,376	42,387
మహబూబాబాద్	7,74,549	6,98,173	76,376
ములుగు	2,94,671	2,83,178	11,493
మొత్తం	38,20,369	28,28,036	9,92,333

జిల్లాల వారీగా తలసరి ఆదాయం...(రూ.లలో)

జిల్లా	2019-20	2020-21	2021-22	2022-23
వరంగల్ అర్బన్	1,40,994	1,26,594	1,55,055	1,86,618
వరంగల్ రూరల్	1,55,802	1,65,549	1,95,115	2,20,877
జనగామ	1,79,229	1,66,392	1,86,244	2,21,424
మహబూబాబాద్	1,37,562	1,44,479	1,79,057	2,00,309
జేఎస్.భూపాలపల్లి	2,42,945	2,03,564	2,34,132	2,28,655
ములుగు	1,68,702	1,55,821	1,75,527	2,15,772

జిల్లాల వారీగా జీడీడీపీ (రూ.కోట్లలో)


జిల్లా	2019-20	2020-21	2021-22	2022-23
వరంగల్ అర్బన్	17,684	16,181	19,877	23,868
వరంగల్ రూరల్	12,903	13,901	16,509	18,677
జనగామ	10,939	10,353	11,672	13,875
మహబూబాబాద్	12,244	13,092	16,317	18,245
జేఎస్.భూపాలపల్లి	12,157	10,298	11,848	11,481
ములుగు	5,695	5,382	6,147	7,583

పాదముద్రలు పరిశీలిస్తున్న ఎనిమల్ ట్రాకింగ్ టీం సభ్యులు



బాబోయ్ పులి..

- పలుగుల వద్ద రోడ్డుపై లారీడ్రైవర్‌కు కనిపించిన పెద్దపులి
- నాలుగు బృందాలతో అటవీశాఖ గాలింపు
- కవ్వాల్ ఎనిమల్ ట్రాకింగ్ టీంతో అన్వేషణ



పలుగుల ఎస్సీకాలనీ సమీపంలో పెద్దపులి పాదముద్రలు

కాళేశ్వరం: రెండు రోజులుగా పలుగుల గ్రామ శివారు అటవీప్రాంతాల్లో పెద్దపులి తలదాచుకుంది. మహదేవపూర్ మండలం పలుగుల పంచాయతీలోని ఎస్సీకాలనీ సమీపంలోని నీలగిరి వనం వైపు ఉన్న గారెకుంట ఒర్రెలో ఆవాసం కోసం కలియతిరుగుతుంది. బుధవారం ఉదయం కుంట్లం వైపు ఇసుక క్వారీకి వెళ్తున్న ఓ లారీడ్రైవర్ నీలగిరి వనం నుంచి భయటికి వచ్చిన పెద్దపులిని రోడ్డుపై చూశాడు. తను చూసిన పులి పెద్ద ఎద్దులా ఉందని డ్రైవర్ చెప్పడంతో కొందరు యువకులు అటవీశాఖకు సమాచారం అందించారు. దీంతో ఎఫ్ఎస్ఓ ఆనంద్‌తోపాటు కవ్వాల్ ఎనిమల్ ట్రాకింగ్ టీం సభ్యుడు యోగి బృందం పాదముద్రలను పరిశీలించింది.

ఆరు ట్రాకింగ్ కెమెరాలు..

పెద్దపులి రోజుకో చోట సంచరిస్తుండడంతో అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులు పులి పాదముద్రలను పరిశీలిస్తూ ట్రాకింగ్ టీంలతో అన్వేషిస్తున్నారు. మహదేవపూర్, మంచిర్యాల జిల్లా కోటపల్లి అటవీశాఖ ఉద్యోగులు సైతం గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. మంగళవారం గారెకుంట పోచమ్మ ఒర్రె ప్రాంతంలో పులి నీరు తాగిన ఆనవాళ్లు లభించాయి. దీంతో పలుగుల, ఒర్రె ప్రాంతం, కుంట్లం, మద్దుపల్లి అడవిలో ఆరు ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

మూడున్నరేళ్ల మగపులి..

పది రోజులుగా కాటారం, మహదేవపూర్ రేంజ్‌లో సంచరిస్తున్న పులి వయస్సు సుమారుగా మూడున్నరేళ్ల వరకు ఉంటుందని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అది మగ పెద్దపులి అని అనుమానిస్తున్నారు. మ్యాన్ ఈటర్ కాదని, త్వరలోనే సరిహద్దు దాటి భయటికి వెళ్తుందని చెబుతున్నారు. ఆవాసం కోసం చూస్తున్న పులి గోదావరి సరిహద్దుల్లోనే తచ్చాడుతోందంటున్నారు. 2022లో వచ్చిన పెద్దపులి కూడా అన్నారం వైపు నుంచి పలుగుల మీదుగా కుంట్లం వద్ద గోదావరి దాటిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు.

అటవీశాఖ మౌనం..

పదిరోజులుగా పెద్దపులి రెండు మండలాల్లోని రేంజ్‌లో తిరుగుతున్నా అటవీశాఖ అధికారులు మౌనంపాటిస్తున్నారు. వివరాలు వెల్లడించడానికి వెనుకాడుతున్నారు. ఉన్నతాధికారులు తెలుపుతారని దాటవేసే సమాధానం చెబుతున్నారు. అధికారులు అమర్చిన ట్రాకింగ్ కెమెరాలకు పులి చిక్కిందా..? లేదా? చిక్కినా భయటికి చెప్పడంలేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయమై ఎఫ్ఎస్ఓ ఆనంద్‌ను సంప్రదించగా ఆరు కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. కెమెరాలకు చిక్కలేదన్నారు. పులి సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పులికి హాని కలిగించొద్దని పేర్కొన్నారు.

సామాన్యుల వద్దకే న్యాయసేవలు
భూపాలపల్లి అర్బన్: సామాన్యుల వద్దకే న్యాయసేవలు తీసుకెళ్లడంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ చొరవ తీసుకుంటుందని డిప్యూటీ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ కంప అక్షయ, ప్రియాంక తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వేశాలపల్లిలో బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆర్థికంగా వెనుకబడిన, నిమ్న కులాల వారికి, మహిళలకు, వయో వృద్ధులకు ఉచిత న్యాయసాయం అందించడమే జిల్లా న్యాయసేవాధికార సంస్థ లక్ష్యమని తెలిపారు. మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

భూ వివాదంలో వ్యక్తి దారుణ హత్య



నాగవెల్లి రాజలింగమూర్తి(ఫైల్)

భూపాలపల్లి: భూవివాదంలో భూపాలపల్లి జిల్లాకేంద్రానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫక్కీర్‌గడ్డ(ఆకుదారివాడ)కు చెందిన 15వ వార్డు తాజా మాజీ వార్డు కౌన్సిలర్ నాగవెల్లి సరళ, ఆమె భర్త, రాజలింగమూర్తి(49) కొన్ని నెలలుగా పట్టణంలోని రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నారు. రాజలింగమూర్తి బుధవారం సాయంత్రం ఫక్కీర్‌గడ్డలోని తన బంధువుల ఇంటికి వెళ్లి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్దకు వచ్చాడు. అక్కడ టీ తాగి రెడ్డి కాలనీలోని తన ఇంటికి రాత్రి సుమారు 7 గంటలకు వెళ్తున్న క్రమంలో హత్యకు గురయ్యాడు. దుండగులు మొఖం, పొట్ట భాగంలో కత్తులతో విచక్షణారహితంగా పొడవడంతో పేగులు బయటపడ్డాయి. ఈ హత్యలో నలుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు తెలిసింది. జిల్లాకేంద్రంలోని ఓ భూవివాదంలోనే ఈ హత్య జరిగినట్లు సమాచారం. మృతుడి కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి రాస్తారోకో చేపట్టారు. నిందితులను గుర్తించే వరకు అంత్యక్రియలు నిర్వహించమంటూ రోడ్డుపై బైఠాయించారు. కాగా, తన భర్త హత్య వెనుక స్థానిక బీఆర్ఎస్ నాయకులు, స్థానికుల కుట్ర ఉందని మృతుడి భార్య సరళ ఆరోపిస్తోంది.

సైబర్ మోసం.. ఖాతా ఖాళీ
రేగొండ: ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కావాలా..? అంటూ వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించిన ఓవ్యక్తి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు ఖాళీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారాయణపురానికి చెందిన పోలు తిరుపతికి జనవరి 24న 6268040772 నంబరు నుంచి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కావాలా..? అని కాల్ వచ్చింది. ఒకే అనడంతో అవతలి వ్యక్తి పంపిన లింక్‌ను తిరుపతి ఓపెన్ చేయగా వచ్చిన ఓటీపీని నేరగాళ్లకు చెప్పాడు. దీంతో ఖాతా నుంచి రూ.12 వేల నగదు బదిలీ అయింది. బుధవారం బాధితుడి ఫిర్యాదుతో ఎస్సై సందీప్‌కుమార్ కేసు నమోదు చేశారు.

తాగునీటి ఇబ్బందులు రావొద్దు

సమీక్ష సమావేశంలో కలెక్టర్ రాహుల్‌శర్మ



రేగొండ: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి అర్బన్: వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ, విద్యుత్, ఎంపీడీఓలు, ఎంపీఓలతో కలెక్టర్ రాహుల్‌శర్మ బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మంచినీటి సరఫరా పరిస్థితిని ఎంపీడీఓలు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం.. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతుల ఉంటే వెంటనే చేయాలని ఆదేశించారు. గ్రామ, పట్టణాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సమస్య వస్తే 1912 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నారు. మంచినీటి సమస్య వస్తే ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేయాలని తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 26న కాళేశ్వర ముక్తేశ్వరస్వామి దేవాలయంలో జరిగే మహా శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మహాశివరాత్రి వేడుకలపై దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఇరిగేషన్, మత్స్య, విద్యుత్, ఆబ్కారీ, సింగరేణి, ఆర్టీసీ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా బస్సులు నడపాలని ఆర్టీసీ డీఎంకు సూచించారు. మహాశివరాత్రి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్సూర్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డీపీఓ నారాయణరావు, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, మత్స్యశాఖ అధికారి అవినాశ్, దేవస్థానం ఈఓ మహేష్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి
రేగొండ: ప్రతీవిద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళిబద్ధంగా చదవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఇదిలా ఉండగా.. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. పనులను 45 రోజుల్లో పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే రైతువేదికలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మనోరమ, గృహనిర్మాణ పీడీ లోకిలాల్, డీఆర్డీఓ నరేష్, గృహ నిర్మాణ శాఖ ఏఈ రాయలింగు ఉన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- మామునూరు పీటీసీ డీఎస్పీ రమేశ్
- ముగిసిన ఏఆర్ఎస్సైల పదోన్నతి శిక్షణ


మాట్లాడుతున్న పీటీసీ డీఎస్పీ రమేశ్

ఖిలా వరంగల్: పదోన్నతి శిక్షణలో నేర్చుకున్న అంశాలను పరిగణనలోకి తీసుకుని క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని మామునూరు పీటీసీ డీఎస్పీ రమేశ్ అన్నారు. మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో నాలుగు వారాల నుంచి నిర్వహిస్తున్న ఏఆర్ఎస్సైల పదోన్నతి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదోన్నతి పొందిన ఏఆర్ఎస్సైలు పోలీసు శాఖ ప్రతిష్ఠ మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రవీందర్, వెంకటేశ్వర్‌రావు, పాండునాయక్, భిక్షపతి, డాక్టర్ సుధీర్, ఆర్ఐలు చంద్రశేఖర్, నవీన్, కాశీరాం, మహేశ్, నరేశ్, సుధాకర్, సత్యనారాయణ, అశోక్, దేవేందర్‌రెడ్డి, రాజేశ్, నందకిశోర్, దశరథం, సుధాకర్, సమ్మిరెడ్డి, సీఆర్వో రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అనుమానాస్పద మృతి

- సుబేదారి పీఎస్ పరిధిలో ఘటన
- మృతుడిది హైదరాబాద్‌లోని బోరబండ


ఉప్పలయ్య మృతదేహం

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డులో బుధవారం ఓ ఆటో డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన కలకలం సృష్టించింది. హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్ బోరబండకు చెందిన ఉప్పలయ్య హైదరాబాద్‌లో రాకేశ్ అనే వ్యక్తి నుంచి గత నెల 23వ తేదీ నుంచి ఆటోను కిరాయికి తీసుకుని నడుపుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఆటోలో హనుమకొండకు వచ్చాడు. ఆటోను హంటర్‌రోడ్డులో నిలిపి ఉంచాడు. అయితే ఆటో వెనక సీట్లో మృతి చెంది ఉన్నాడు. దీనిని గమనించిన స్థానికులు వెంటనే సుబేదారి పోలీసులకు సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఉప్పలయ్యను ఎవరైనా హత్య చేశారా? లేదా సాధారణంగా మృతి చెందాడా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. ఆటో నంబర్ ఆధారంగా యజమానితో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నట్లు ఏసీపీ దేవేందర్ రెడ్డి తెలిపారు.






ఆర్టీసీ ఉద్యోగులకు 'పవర్'

శారీరకంగా, మానసికంగా సన్నద్ధం చేయడమే లక్ష్యంగా శిక్షణ..

- సిబ్బంది ఆరోగ్యంపై సంస్థ ప్రత్యేక శ్రద్ధ
- పర్యవేక్షణకు సేఫ్టీ వార్డెన్, హెల్త్ వలంటీర్ల నియామకం
- లక్ష్య సాధన వైపు ప్రోత్సహించేందుకు మెంటార్స్



హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులను శారీరకంగా, మానసికంగా సన్నద్ధులను చేసి శక్తివంతులుగా తీర్చిదిద్దడానికి 'పవర్' పేరుతో శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఇప్పటికే ఆదాయం పెంపుతోపాటు సంస్థ పరిరక్షణకు 'ఒక గొప్ప మార్పుకు ఇదే శ్రీకారం', 'ఏప్రిల్–ఆగస్ట్ చాలెంజ్ ఫర్ ట్రెనింగ్' వంటి శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. ఈ కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడంతో మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులు, సూపర్‌వైజర్లకు అవసరమైన నైపుణ్యాలు, మెళకువలు నేర్పి వారిని శారీరకంగా, మానసికంగా శక్తివంతులను చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా 'పవర్' (పీక్ పెర్ఫార్మెన్స్ త్రూ ఓనర్‌షిప్ విత్ ఎంపతి రిజాల్వ్) పేరుతో ఉద్యోగులకు శిక్షణ ఇస్తోంది. సంస్థలో ఉద్యోగుల భాగస్వామ్యం, ప్రయాణికులతో సహానుభూతితో అత్యున్నత ఫలితాల సాధనకు దృఢసంకల్పంతో ముందుకు సాగడం ఈ కార్యక్రమం లక్ష్యం. సంస్థకు ప్రయాణికులే ప్రధాన వనరు. ఈ క్రమంలో వారిపై ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించడం, వారిని ఆర్టీసీ వైపు ఆకర్షించేలా చేయడం, ప్రశాంత మనస్సుతో విధులకు హాజరుకావడానికి తీసుకోవాల్సిన విశ్రాంతి, శారీరకంగా దృఢంగా ఉండడానికి చేపట్టాల్సిన క్రియలు, ఇతర అంశాలు ఈ శిక్షణలో బోధించి ఉద్యోగులను సన్నద్ధం చేస్తారు.

ఉద్యోగుల ఆరోగ్యం ముఖ్యం..

ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతీ డిపోలో ఒక సేఫ్టీ వార్డెన్, ఇద్దరు హెల్త్ వలంటీర్లను నియమించారు. వీరు ఆ డిపోలోని ప్రతీ ఉద్యోగి ఆరోగ్యాన్ని గమనిస్తుంటారు. ఏదేని అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుంటే వారికి అవసరమైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటారు. ఔషధాలు సమయానుకూలంగా వాడేలా వారిని జాగృతం చేస్తారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి మందులు సరిగా వేసుకునేలా సూచనలు చేస్తారు. తద్వారా ఆ ఉద్యోగి ఆరోగ్యంగా ఉండేలా చూస్తారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడానికి నిర్దేశం చేస్తారు. అదే విధంగా డ్రైవర్లు ప్రమాదాలు చేయకుండా ఉండేందుకు, సురక్షిత డ్రైవింగ్, ఇంధన పొదుపుపై శిక్షణ ఇచ్చేందుకు ప్రతి డిపోలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించారు. ఆదాయం, కేఎంపీఎల్ అధ్యయనం చేసేందుకు ప్రతీ డిపోకు 20 మంది మెంటార్స్‌ను నియమించారు. వీరు నిర్దేశించిన లక్ష్యం వైపు నడిచేలా జాగ్రత్తలు వివరిస్తారు. టార్గెట్ మేరకు ఆదాయం వచ్చిందా..? ఇంధన పొదుపు జరుగుతుందా వంటి అంశాలను పరిశీలిస్తూ వారికి కావాల్సిన సూచనలు ఇస్తారు.

ఉద్యోగులను కార్యోన్ముకులను చేసేందుకు..



ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులను కార్యోన్ముకులను చేసేందుకు సంస్థ 'పవర్' అనే కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తోంది. ఇందులో ప్రతీ ఉద్యోగికి శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించాం. ప్రతీ రోజు విధులకు ప్రశాంతంగా హాజరయ్యేలా తీర్చిదిద్దుతాం. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడానికి తగు జాగ్రత్తలు వివరిస్తాం. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు అవసరమైన సమగ్ర శిక్షణ ఈ 'పవర్' కార్యక్రమం ద్వారా ఉద్యోగి పొందుతారు. తద్వారా శక్తివంతులుగా తయారవుతారు.

-డి. విజయభాను, వరంగల్ ఆర్ఎం

వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో శిక్షణ ప్రారంభం

'పవర్' శిక్షణ కార్యక్రమాలు వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో ఈ నెల 18వ తేదీన ప్రారంభమయ్యాయి. డిపోలోని ఉద్యోగులను గ్రూపులుగా ఏర్పాటు చేసి పది రోజుల్లో ఉద్యోగులందరికీ శిక్షణ పూర్తి చేస్తారు. ఈ మేరకు ఇప్పటికే ట్రైనర్లకు హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో డిపో మేనేజర్లు ఫ్యాకల్టీగా వ్యవహరిస్తారు. ఓనర్‌షిప్, దృఢ సంకల్పం, ఆటలు, పాటలు, ఇతర కార్యకలాపాలు, రోడ్డు భద్రత, ప్రయాణికుల పట్ల మర్యాద, వస్త్రధారణ(యూనిఫాం), కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆరోగ్యంపై శిక్షణ ఇస్తారు. దేశంలోని ప్రజారవాణా సంస్థల్లో లో తెలంగాణ ఆర్టీసీ సంస్థ బెంచ్‌మార్క్‌గా ఉండేలా చూసుకుంటూ నిరంతర అభ్యాసం, శిక్షణ ఇస్తున్నారు. ఆర్టీసీ ఉద్యోగులతో పాటు అద్దె బస్సుల డ్రైవర్లకు శిక్షణ ఇస్తారు. శిక్షణలో పాల్గొనే ఉద్యోగులకు స్పెషల్ ఆఫ్ సెలవు ఇస్తారు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనంతో పాటు, రెండుసార్లు టీ, స్నాక్స్ అందిస్తారు. ప్రతి రోజూ ఉద్యోగుల హాజరు వివరాలను ప్రధాన కార్యాలయానికి పంపుతారు.

ఆర్టీసీ అభివృద్ధికి ప్రతీ ఉద్యోగి కృషి చేయాలి

- వరంగల్ ఆర్ఎం విజయభాను


ఆర్టీసీ ఆర్ఎం విజయభానును సన్మానిస్తున్న బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

హన్మకొండ: ఆర్టీసీ అభివృద్ధికి ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను అన్నారు. బుధవారం హనుమకొండలోని వరంగల్ రీజియన్ కార్యాలయంలో రీజినల్ మేనేజర్ డి.విజయభానుకు ఆర్టీసీ బీసీ సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.నిరంజన్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభానును సన్మానించారు. ఆర్ఎం మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ ఆదాయం పెంచుతూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆర్టీసీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్స్) కేశరాజు భానుకిరణ్‌కు బీసీ సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ కమిటీని పరిచయం చేసి సన్మానించారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ చీఫ్ అడ్వయిజర్ ఎం.ఎస్.రావు, రీజియన్ అధ్యక్షుడు గొలనకొండ వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు వి.అంజనీదేవి, వేముల రవి, ఉపాధ్యక్షుడు ఎం.మంజుల, కార్యదర్శి మాదారపు సాంబయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ దద్దనాల ఉమాదేవి, కోశాధికారి పి.రాధిక, నాయకులు జి.ఎస్.పాణి, కె.దేవేందర్, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఒంటరి మహిళలే లక్ష్యంగా..

చోరీలకు పాల్పడుతున్న దంపతుల అరెస్ట్

- రూ. 7.50 లక్షల విలువైన 80.5 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం : రద్దీ సమయాల్లో బస్టాండ్‌లో ఒంటరి మహిళలే లక్ష్యంగా బంగారు ఆభరణాలు చోరీలకు పాల్పడుతున్న దంపతులను అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తెలిపారు. వీరి నుంచి సుమారు రూ. 7.50 లక్షల విలువైన 80.5 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండల కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన బొంత జ్యోతి, కిషన్ దంపతులు రోజు వారి కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే కూలీ ద్వారా వచ్చే ఆదాయం ఇంటి ఖర్చులకు సరిపోకపోవడంతోపాటు కొద్దికాలంగా ఇద్దరికీ ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో పరిచయస్తుల వద్ద అప్పు చేశారు. తిరిగి చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. దీంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడాలనుకున్నారు. అనుకున్నదే తడువుగా బస్టాండ్‌లో రద్దీ సమయాల్లో ఒంటరి మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. మహిళా ప్రయాణికులు బస్సు ఎక్కే సమయంలో నిందితులు బంగారు ఆభరణాలు చోరీ చేసి పరారవుతున్నారు. ఇదే రీతిలో ఈ నెలలో హనుమకొండ బస్టాండ్‌లో మూడు చోరీలకు పాల్పడ్డారు. ఈ చోరీలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకున్న హనుమకొండ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు టీం ఏర్పాటు చేసి నిందితులను గుర్తించారు. చోరీ సొత్తును హనుమకొండలోని ఏదేని బంగారు దుకాణంలో విక్రయించేందుకు బుధవారం ఉదయం చౌరస్తాకు రావడంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఈ దంపతులపై అనుమానం కలిగింది. దీంతో వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు నిందితులు అంగీకరించడంతో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.

తెలుగు విభాగం అధిపతిగా లింగయ్య

- కేయూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ


డాక్టర్ మామిడి లింగయ్యకు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతిగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడి లింగయ్య నియమితులయ్యారు. బుధవారం రాత్రి రిజిస్ట్రార్ వి.రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయనకు వీసీ, రిజిస్ట్రార్ ఉత్తర్వులు అందించారు. ఆ విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి ఈ ఏడాది జనవరిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ విభాగంలో రెగ్యులర్ ప్రొఫెసర్లు ఎవరూ లేరు. నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తుండగా సీనియార్టీ ప్రాతిపదికనే నియమించాల్సి ఉన్నప్పటికీ వెంటనే నియమించకుండా యూనివర్సిటీ అధికారులు జాప్యం చేశారు. గత నెలాఖరులో సీనియార్టీని తేల్చేందుకు కమిటీ వేయగా, చైర్మన్ ప్రొఫెసర్ టి.మనోహర్ రెండు రోజుల క్రితం రిపోర్టు ఇచ్చారు. సీనియర్‌గా ఉన్న మామిడి లింగయ్యనే నియమించారు. లింగయ్య 2004లో తెలుగు విభాగంలో పార్ట్‌టైం లెక్చరర్‌గా ప్రవేశించారు. 2013లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. తెలుగు విభాగం అధిపతిగా నియామకంతోపాటు యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ నుంచి బదిలీ కూడా చేశారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

బీఓఎస్ నియామకంలో జాప్యం..

నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లలో సీనియార్టీని తేల్చి రిపోర్టును కమిటీ ఇచ్చినప్పటికీ విభాగం అధిపతిని మాత్రమే నియమించారు. బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఎవరినీ నియమించలేదు. రెండో సీనియార్టీ ప్రకారం డాక్టర్ మంథిని శంకర్‌ను నియమించాల్సింది. సీనియార్టీలో మూడో స్థానంలో ఉన్న డాక్టర్ చిర్రరాజు తనను బీఓఎస్‌గా నియమించాలని అధికారులను కోరుతున్నట్లు చర్చగా ఉంది. గతంలో ఒకసారి మంథిని శంకర్ బీఓఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించారని, ఈసారి తనకు అవకాశం కల్పించాలని అడిగినట్లు సమాచారం. ఆ కమిటీ రిపోర్టు ప్రకారం సీనియార్టీలో రెండో స్థానంలో ఉన్న మంథిని శంకర్‌ను నియమిస్తారా లేక మూడో స్థానంలోని చిర్ర రాజును నియమిస్తారా అనే అంశం ఒకటిరెండురోజుల్లో తేలిపోనుంది.

తల్లులూ.. చల్లంగ చూడండి

ఘనంగా తిరుగువారం పండుగ

- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు
- మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో మొక్కుల చెల్లింపులు
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు
- ముగిసిన మినీ మేడారం జాతర


సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకుంటున్న పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు


సమ్మక్క శక్తి పీఠాన్ని గుడిలోని గద్దెపైకి తీసుకొస్తున్న పూజారులు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మ మినీజాతర (మండమెలిగె) ఈనెల 15న (శనివారం) ముగిసింది. ఈ క్రమంలో బుధవారం మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. మేడారం సమ్మక్క గుడిలో పూజారులు అమ్మవారి శక్తి పీఠాన్ని, అమ్మవారి శక్తి పీఠం గద్దెను అలంకరించారు. అనంతరం సమ్మక్క శక్తి పీఠాన్ని ఐదుగురు పూజారుల చేతుల మీదుగా గద్దె పై పెట్టారు. తర్వాత అమ్మవారికి సారా, కల్లు, పాలను ఆరగింపు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుగువారం పండుగ సందర్భంగా పూజారులు కుటుంబీకులు, ఆదివాసీలు సమ్మక్క గుడికి వెళ్లి పూజలు నిర్వహించారు. అలాగే, కన్నెపల్లి సారలమ్మ గుడిలో పూజారులు తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. సారలమ్మ గుడి వడేరాల కుండలు, గంటలు, వస్త్రాలు శుద్ధి చేసి పూజలు నిర్వహించిన అనంతరం భద్రపరిచారు. పూజారులు సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు కుటుంబ సమేతంగా సమ్మక్క గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సమ్మక్క పూజారులు సిద్దబోయిన మునీందర్, నితిన్, మహేశ్, సిద్దబోయిన భోజారావు, దశరథ, కొక్కెర కృష్ణయ్య, దూపవడ్డె నాగేశ్వరరావు, మల్లెల సత్యం, పూర్ణ, సిద్దబోయిన నర్సింగరావు, సారలమ్మ పూజారులు కాక సారయ్య, కాక కిరణ్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మినీజాతర ముగిసిన నేపథ్యంలో వచ్చే ఏడాది మహాజాతరకు ప్రభుత్వ వర్గాలు సిద్ధమవుతున్నాయి. ఎండోమెంట్ సూపరిండెంటెంట్ క్రాంతికుమార్, జూనియర్ అసిస్టెంట్లు బాలకృష్ణ, జగదీశ్.. భక్తులకు సేవలందించారు.

అమ్మవార్లకు భక్తుల తిరుగువారం మొక్కులు..

తిరుగువారం పండుగ సందర్భంగా భక్తులు వేలాదిగా మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగు షవర్ల కింద స్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుగువారం పండుగతో మినీ జాతర పూజా కార్యక్రమాలు ముగిశాయి. ఈనెల 23న (ఆదివారం) ఆనవాయితీగా పూజారులు వనభోజనాలు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

పూనుగొండ్ల గ్రామంలో..

గంగారం : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామంలో పగిడిద్దరాజు తిరుగువారం జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు బిందెలతో నీళ్లు ఆరబోశారు. కార్యక్రమంలో పెనక పురుషోత్తం, పెనక రాజేశ్, పెనక సాంబయ్య, రామస్వామి, వెంకటయ్య, వడ్డె కల్తి జగ్గారావు, పెనక సమ్మయ్య, పెనక రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లుల దీవెనలతో జాతర విజయవంతం..

సమ్మక్క, సారలమ్మల దీవెనలతో మినీ జాతర విజయవంతమైంది. స్థానిక ఆదివాసీ బిడ్డ, మంత్రి సీతక్క ఈ సారి మినీ జాతర్‌పై ప్రత్యేక దృష్టి సారించి రూ.5 కోట్లు కేటాయించి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, జిల్లా అధికారుల సమన్వయంతో మినీజాతర విజయవంతమైంది. మళ్లీ మహాజాతర నాటికి ప్రభుత్వం మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలి.

- సిద్ధబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

కమిషనరేట్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎదుట బుధవారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి కథనం ప్రకారం.. కాజీపేటకు చెందిన ఓ మహిళ రెండో వివాహం చేసుకుంది. అనంతరం రెండో భర్తపై అత్యాచారం కేసు పెట్టింది. ఆ కేసు విషయంలో సదరు మహిళ అక్కాబావ సాక్షులుగా ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం కోర్టులో సదరు మహిళ అక్కాబావ గొడవ పెట్టుకున్నారు. అనంతరం ఏం విషయంలో.. ఏం జరిగిందో తెలియదు కానీ సదరు మహిళ.. అక్కాబావపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీ కార్యాలయంలో ఎదుట కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా భద్రతా సిబ్బంది అడ్డుకుని సుబేదారి పీఎస్‌కు తరలించారు. ఈ ఘటనలో సదరు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పెరిగిన విద్యుత్ డిమాండ్..

- బుధవారం రాష్ట్రంలో అత్యధికంగా 16,058 మెగావాట్లు
- టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 5,497..

హన్మకొండ: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. వేసవిలో పెరగాల్సిన డిమాండ్ ఈసారి ఫిబ్రవరిలోనే పెరిగింది. ఫలితంగా ఈ నెల 10న అత్యధికంగా రాష్ట్రంలో 15,998 మెగావాట్లకు చేరుకుంది. బుధవారం విద్యుత్ డిమాండ్ 16,058 మెగావాట్లకు చేరుకుంది. అదే విధంగా టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఈ నెల 10న విద్యుత్ సరఫరా డిమాండ్ 5,361 మెగావాట్లు ఉండగా బుధవారం 5,497 మెగావాట్లకు చేరుకుంది. ఫిబ్రవరిలోనే ఎండలు మండిపోతుండడంతో విద్యుత్ ఉపకరణాలు వినియోగం పెరిగింది. ఏసీలు, కూలర్లు వాడుతుండడంతో పాటు పంటల సాగుకు నీటి అవసరాలు పెరగడంతో భూగర్భ జలాలు తోడేందుకు విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో విద్యుత్ సరఫరా డిమాండ్ పెరిగింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సర్కిళ్ల వారీగా విద్యుత్ డిమాండ్ వివరాలు

జిల్లా	ఫిబ్రవరి 14న		15న		16న		17న		18న	
(సర్కిల్)	2024	2025	2024	2025	2024	2025	2024	2025	2024	2025
హనుమకొండ	313	308	313	505	331	319	314	309	307	315
వరంగల్	285	304	275	309	276	298	285	302	288	312
జనగామ	283	295	295	308	277	308	289	313	304	312
మహబూబాబాద్	351	375	330	394	354	386	384	400	370	403
భూపాలపల్లి	357	370	357	369	363	310	354	307	327	328

రోడ్డు ప్రమాద నిందితులకు జైలు

- వివరాలు వెల్లడించిన సీఐ క్రాంతికుమార్

పరకాల: పరకాల పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ఇద్దరి నిందితులకు జైలు శిక్షపడింది. పరకాల సీఐ క్రాంతికుమార్ కథనం ప్రకారం.. 2015లో పరకాలలోని ఎం.ఆర్ రెడ్డి కళాశాల సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన పుట్ట యుగేంధర్‌ను మరో ద్విచక్రవాహనంపై వెళ్తున్న నిజాంపల్లి గ్రామానికి చెందిన కుంచాల లింగమూర్తి ఢీకొన్నాడు. దీంతో యుగేందర్ కిందపడిపోగా..అదే సమయంలో లారీ అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై దీపక్ కేసు నమోదు చేయగా కోర్టు కానిస్టేబుల్ నాగరాజు, సారంగపాణి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాలు విన్న పరకాల అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శాలినిలింగం.. నిందితులు ఇద్దరు లింగమూర్తికి 2 సంవత్సరాలు, లారీ డ్రైవర్ ఎస్.డి యాసిన్ పాషాకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఇద్దరికి రూ.6వేల జరిమానా విధించినట్లు సీఐ క్రాంతికుమార్ బుధవారం తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ 45 చ॥గ॥ G+2 ఫర్నిషింగ్‌తో క్లియర్ టైటిల్ గలది. మెయిన్‌రోడ్‌కు దగ్గరలో ఎయిర్‌పోర్ట్ రోడ్, శంభునిపేట్, వరంగల్. Opp: రేనాల్డ్ స్కూల్ సంప్ర॥ 9391565095 / W: +18474431516. [WA-6552]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 8341479342. [WA-7554]

LOSS OF CERTIFICATE

■ I, GUNTIPALLY RAMANJANEYULU, S/o. RAMULU, aged 20 years R/o. H.No. 17-88/2, Subhash Nagar, Husnabad, Siddipet District. I have lost my original B.Tech (ECE) grade sheet for the 2nd year, 1st semester which was issued to me by the NIT Warangal college bearing Roll No. 22ECB0B27, near the NIT campus while walking from NITW main gate to Hostel (Campus surrounding) of Hanamkonda District on 01/02/2025. If anyone is found, please inform me at the above address and Cont No: 9440553881. [W-1264082]

CHANGE OF NAME

■ I, SHAIK SAMEENA RUHI, (Old name), R/C. H.No.6-1-37/2, Kankarboard Mahabubabad Town & Mandal, Mahabubabad District - 506101, Telangana State India, have changed to my name MOHAMMAD SAMEENA RUHI (New name), W/o. Mohammed Kaleem [W-1264134]

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్ కేర్ సర్వీస్ 24 గం॥ 12 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. 8186926067, 8977263124. [W-1264133]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]

WANTED

■ Urgently required senior Faculty in Maths, Physics, Chemistry & Biology with a minumum of 10yrs of teaching experience in NEET & IIT-JEE. Competitive Salary asper market standards. SHAHEEN JUNIOR COLLEGE Mulugu X Road HNK. +918374999475 [SCA25001745]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA25001686]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.